అమ్మ పాలు బిడ్డకు అమృతం

- శిశువు పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలి
- బిడ్డ ఎదుగుదలకు ఇవి ఎంతో మేలు
- ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలి
- జిల్లాలో ఏటా 40 వేలకు పైగా ప్రసవాలు
- తల్లి పాల ప్రాధాన్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది
- 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు




కోసిగిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తూ మానవహారంగా ఏర్పడిన వైద్యసిబ్బంది, విద్యార్థినులు, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సృష్టిలో ఏ జీవికైనా మొదటి ఆహారం తల్లిపాలే. జన్మించిన వెంటనే ఆ బిడ్డ తల్లి స్తన్యాన్ని తాకుతుంది. ఆ స్పర్శతోనే తల్లికి స్తన్యంలో పాలు ఉత్పత్తి అవుతాయి. ఇది ప్రకృతిలో ప్రతి జీవికి సృష్టి కల్పించిన అద్భుతం. అలాగే ప్రతి తల్లికి ఇదే విధంగా పాల ఉత్పత్తి జరుగుతుంది. బిడ్డ జన్మించినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని వైద్యులు సూచిస్తారు. తల్లి పాలలో ఉండే పోషకాలు ఇతర ఏ ఆహారంలోనూ లభించవని, అవి బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొంటారు. అందుకే తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేది వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వీటితో పాటు కొత్తగా మరో 12 పీహెచ్‌సీలు మంజూరయ్యాయి. వీటికి సొంత భవనాలు లేనందున వీటి సిబ్బంది కూడా ప్రస్తుత పీహెచ్‌సీల్లో ఉండి వారికి కేటాయించిన ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీటితో పాటు ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ఏటా 40 వేల నుంచి 42 వేల మంది ప్రసవిస్తుంటారు. ప్రసవం అయ్యాక ఆయా ఆసుపత్రుల్లో శిశువులకు గంటలోపు తల్లిపాలను వైద్య సిబ్బంది పట్టిస్తుంటారు. ఈ మేరకు తల్లిపాలపై వైద్యులు, నర్సులు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లిపాలతో కలిగే ప్రయోజనాలు

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3, ఒమెగా 6, ఒమెగా 9 బిడ్డ మెదడు వికాసానికి తోడ్పడుతాయి.
- ఈ పాలలో బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని లాక్టోజుతో క్యాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటు వ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. బిడ్డలకు డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండెవ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- అలర్జీ, ఆస్తమా, డయాబెటీస్ వంటి వ్యాధులు దరిచేరవు
- బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లిపాలిచ్చేందుకు అనుకూలతను కలిగించాలి

తల్లిపాలకు ఇప్పటికీ ప్రత్యామ్నాయం రాలేదు. పోతపాలు అందరికీ సరిపడవు. ఎక్కువ మందికి వాంతులు, విరేచనాలు అవుతాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడమే శ్రేయస్కరం. అయితే ఉద్యోగం, పని చేసే ప్రాంతంలో, పబ్లిక్ ప్రదేశాలలో బిడ్డకు తల్లిపాలు పట్టించేందుకు సరైన సౌకర్యం ఉండదు. ఈ క్రమంలో చాలామంది తల్లులు పిల్లలు పెద్దయ్యే వరకు ఇంటివద్దే ఉండిపోతున్నారు. పాలిచ్చే తల్లి కూడా అందరిలాగా జీవించాలనుకుంటే వారికి అవసరమైన అనుకూలతలు సృష్టించాలి. బిడ్డకు పాలిచ్చే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ఇందుకు సమాజంలో ప్రతిఒక్కరూ తల్లికి సహకరించాలి.

పాలు పుష్కలంగా పడాలంటే...

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లి, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీట్లు) తీసుకోకుండా ప్రకృతి సహజంగా లభించే పండ్లు తినాలి.

వీటికి దూరంగా ఉండాలి

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానీయాలు తీసుకోకూడదు. ఇది శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

తల్లి పాలు ఎప్పుడు.. ఎలా పట్టాలంటే..!

బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. తల్లి పాలు బిడ్డకు తేలికగా జీర్ణమవుతాయి. తల్లిపాలు ఎంతో స్వచ్ఛంగా, ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీంతో ఎదిగే బిడ్డకు ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటుంది.

ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి

గర్భిణి ప్రసవించిన తర్వాత మొదటి అరగంటలోపు తల్లికి వచ్చే పాలను ముర్రుపాలంటారు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. చాలా మంది ఈ పాలను బిడ్డకు తాగించకుండా నిర్లక్ష్యం చేస్తారు. ఇందులో వ్యాధినిరోధక శక్తి పెంచే గుణం ఉంటుంది. అంతేగాక ఈ పాలు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందజేస్తాయి. బిడ్డకు చాలా రకాల వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడతాయి. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు. తల్లిపాలు తాగే పిల్లల్లో ఆకస్మిక మరణాలు తక్కువే.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశాం. తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డకు తల్లిపాలు ఎందుకు ఇవ్వాలి అనే అంశాలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

భవిష్యత్‌లో తల్లిపాల బ్యాంకులు



తల్లిపాలు ఒక ఆహార ఎంపిక మాత్రమే కాదు. ఇది శిశువుల ఆరోగ్యానికి ముఖ్యమైన హెల్త్ ఇన్వెస్ట్‌మెన్ట్ అని చెప్పాలి. భవిష్యత్ తరాలను ఆరోగ్యంగా ఉంచేందుకు తల్లులకు మద్దతు అందించడం ముఖ్యం. భవిష్యత్‌లో తల్లిపాల బ్యాంకులు కూడా రాబోతున్నాయి. ఉద్యోగం చేసే తల్లులకు ఇలాంటివి ఎంతో ఉపయోగపడతాయి. పాలివ్వడం వల్ల తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. తర్వాత గర్భధారణ ఆలస్యం అయ్యేందుకు దోహదపడుతుంది.

–డాక్టర్ఆర్‌డి.రచన,నియోనెటాలజిస్టు, కర్నూలు

క్లుప్తంగా

చౌక ధరకే బియ్యం, కందిపప్పు



డీమార్టులో పోస్టర్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): రైతుబజార్లు, రిటైల్ మార్కెట్లలో తక్కువ ధరకు అందుబాటులో ఉన్న బియ్యం, బ్యాళ్లను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో/ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కె.మధుసూదన్‌రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో చౌక ధరకు లభించే బియ్యం, కందిపప్పునకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో కేజీ స్టీమ్డ్ బియ్యం ధర రూ.55.85 ఉండగా రూ. 48కు,ముడిబియ్యం ధర 52.40 ఉంటే రూ. 47కు,కేజీకంది కప్పు రూ.181 ఉండగా రూ. 150కే అందిస్తున్నట్లు చెప్పారు. డీఎస్‌ఓ ప్రసాద్, ఏఎస్‌ఓ రామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.మధుసూదన్‌రావు, డీఎస్‌ఓ డీమార్టులో విక్రయిస్తున్న బియ్యం, కంది బ్యాళ్ల ధరలను పరిశీలించారు. అక్కడినుంచి వెళ్లి బళ్లారి చౌరస్తా సమీపంలో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. సమయానికి బియ్యం ఇస్తున్నారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

కర్నూలు(సెంట్రల్): విద్యాసంస్థల్లో డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ నాయకులు డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంతో మంది యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో కొందరు స్వార్థపరులు డ్రగ్స్‌ను విద్యాసంస్థలకు పాకించారని, నివారణకు ప్రతి కాలేజీ లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని కోరా రు. నాయకులు మురళీనాయుడు, కోటి యాదవ్, శ్రీరాములు యాదవ్, వేల్పుల గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు కళాక్షేత్రం సభ్యుల సమావేశం

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో శాశ్వత సభ్యుల సమావేశాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాక్షేత్రంలో మొత్తం 225 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. అందరూ సమావేశాని కి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కళాక్షేత్రం గౌరవ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు నృత్య రూపక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం సౌజన్యంతో ఈనెల 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీ క్యాంప్‌లోని కళాక్షేత్రంలో శ్రీ సాయిబాబా మహిమలపై నృత్య రూపక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కర్నూలు సాయి భక్తులచే ఈ నృత్య రూపక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ నాటకాన్ని షిరిడీలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. సాయిబాబా జీవితంలోని ముఖ్యమైన సంఘటనలతో రూపకల్పన చేసిన ఈ నాటకం రెండో ప్రదర్శనను కర్నూలు నగరంలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

కేరళ బాధితులకు సాయం అందించాలి

కర్నూలు(సెంట్రల్): కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టా రు. నగరంలోని పలు షాపులు, వ్యాపారుల నుంచి విరాళాలను సేకరించారు. నగర కార్యదర్శి బీసన్న, నాయకులు చంటి, రాజశేఖర్, నాగేశ్వరరావు, శరత్‌కుమార్, రంగస్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (టౌన్): నగరపాలకలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలనిఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ప్రావిడెంట్ ఫండ్ సమస్యకు సంబంధించి ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లుగా లోడర్లుగా పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో ఒకే దఫా రూ.18 వేలు జమ చేయడం సబబు కా దన్నారు. నాలుగు విడతలుగా రికవరీ చేయాలన్నారు. 2024లో సమ్మె కాలపు వేతనాలను తక్షణమే చెల్లించాలని, యూనిఫాం కుట్టు చార్జీలు చెల్లించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులు, ఏపీజీఎల్ఐ బాండ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆ సంఘం నాయకులు చంద్రశేఖర్, పులగం మద్దిలేటి, సవారి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను అవినీతి, అక్రమాలకు అడ్డాగా మార్చిన సెక్యూరిటీ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులకు పాల్పడిన ఏజెన్సీ ఎస్‌ఐలను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ల విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

శాకంబరీ నమోస్తుతే



శాకంబరీ దేవిగా మహాగౌరి



ప్రత్యేక అలంకరణలో గౌరీశంకరుడు



శాకంబరీ దేవిగా రేణుకా ఎల్లమ్మ



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం మహాగౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం షోడసోపచార పూజ, శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామ, లలిత త్రిశతి పూర్వక లక్ష కుంకుమార్చన, రాహుకాల దీప దుర్గా పూజ, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గౌరీ శంకర స్వామికి పంచామృతాభిషేకాలు, సామూహిక అన్నార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– స్థానిక రాజ్‌విహార్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. శ్రీ లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకం



ఎన్‌సీసీ క్యాడెట్లతో డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి

కర్నూలు(అర్బన్): దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర ఎంతో ఉందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. ఈ నెల 1, 2 తేదిల్లో ఆయన జిల్లా కేంద్రంలోని ఎన్‌సీసీ గ్రూప్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయనకు ఎన్‌సీసీ క్యాడెట్లు గార్డ్ ఆఫ్ హానర్‌ను అందించారు. గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ రమేష్ కార్యాలయ పనితీరును వివరించారు. ఈ నేపథ్యంలోనే ఆయన 9వ ఆంధ్ర బాలికల బెటాలియన్‌ను పరిశీలించారు. అనంతరం బెటాలియన్ తీరుతెన్నులను కమాండెంట్ కల్నల్ జోషి ఫిలిప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైనా, థాయిలాండ్‌లో జరిగిన సాఫ్ట్ బాల్ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్యాడెంట్లను ఆయన అభినందించారు. శుక్రవారం ఇండస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీఎం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా ఐక్యత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ దేశ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఈ రకమైన ఐక్యత, క్రమశిక్షణతో యువత సన్మార్గంలో పయనిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ విలియమ్స్, ప్రిన్సిపాల్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక రూపకర్తకు నివాళి

కర్నూలు కల్చరల్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బీక్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్, అధ్యాపకులు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశ జాతీయ పతాకాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి పింగళి వెంకయ్య అని కొనియాడారు. అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, చిన్న మల్లేశ్వరుడు,ఉల్గోజీరావు,తదితరులు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విధుల్లో చేరిన సీఐ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజారావు

కర్నూలు: కర్నూలు రెండవ పట్టణ సీఐగా నియమితులైన జి.వి.నాగరాజరావు శుక్రవారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడున్న ఇంతియాజ్ బాషాను వీఆర్‌కు పంపి కర్నూలు సీసీఎస్‌లో ఉన్న నాగరాజరావును నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈయన 2002లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి ఉమ్మడి కర్నూలు, చిత్తూరు జిల్లాలోని పలు స్టేషన్లలో విధులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ బాలు నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలకు 18,500 వేతనం పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పిస్తామని ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీ నిబంధనల మేరకు నడుచుకోవడం లేదన్నారు. నెలనెలా జీతాలు చెల్లించడం లేదని, పీఎఫ్, ఈఎస్‌ఐ నగదును జమ చేయడం లేదన్నారు. ప్రస్తుతానికి 7 నెలల జీతాలు పెండింగ్‌లో ఉండడంతో డ్రైవర్ల కుటుంబాలు పస్తులుంటున్నాయని, జీతాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మీయ వీడ్కోలు



ఇందిరాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీజీఎల్‌ఐలో సూపరింటెండెంటుగా పనిచేసి పదవీ విరమణ చేసిన కేటీ ఇందిరాదేవిని స్థానిక అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ నెల 31న వైఎస్సార్ జిల్లాలో ఆమె పదవీ విరమణ చేశారు. కర్నూలులో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగులకు సేవలందించిన నేపథ్యంతో శుక్రవారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీజీఎల్‌ఐ సహాయ సంచాలకులు గౌరి మాట్లాడుతూ.. ఇందిరాదేవి సేవలను కొనియాడారు. ఆమె శేషజీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. సూపరింటెండెంట్లు పి.రామాకృష్ణారెడ్డి, మాధవికళ్యాణి, సిబ్బంది మద్దిలేటి, శివకుమార్, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ డబ్ల్యూ సీతారాం

కర్నూలు (టౌన్): క్రీడల వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని న్యూరాలజిస్టు డాక్టర్ డబ్ల్యూ సీతారాం అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి భూషణరావు స్మారక అండర్-13 విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్ రింగ్‌లో బాల్ వేసి పోటీలను ప్రారంభించిన ఆయన భూషణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలను ఎంచుకొని ప్రతిరోజు సాధన చేయాలన్నారు. తద్వారా చురుగ్గా ఉంటారన్నారు. బాస్కెట్‌బాల్ నిర్వహణ కార్యదర్శి దాదాబాషా మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో 12 బాలురు, 12 బాలికల జట్లు పాల్గొన్నాయన్నారు. న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, రిటైర్డు డీఎస్పీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు




రోడ్డు సేఫ్టీ సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో రోడ్డు సేఫ్టీ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గత నెల 25వ తేదీన జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పెరిగిన ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కర్నూలు వైద్య కళాశాల వద్ద మలుపు విస్తరణ, మద్దూరు నగర్ నుంచి సి.క్యాంపు వరకు రోడ్డు, చెక్ పోస్టు నుంచి నందికొట్కూర్ రోడ్డు, నగర సరిహద్దు శివారు వరకు రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్ల తొలగింపు, వారి కోసం ప్రత్యేకంగా జోన్ల ఏర్పాటు, నిర్మాణాలు జరుగుతున్న చోట ప్రమాదాలు జరగకుండా బారియర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరో ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ట్రాఫిక్ సీఐ గౌతమి రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ షాకీర్ డీసీపీ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బీపీపై రేపు అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): హైపర్‌టెన్షన్ (బీపీ)పై ఈ నెల 4వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో సదస్సులో ఉంటుందని వెల్లడించారు.

ఆటిజం పిల్లల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆటిజం సమస్యతో ఇబ్బంది పడే పిల్లల కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య నిపుణులతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం అంబికా శిశు కేంద్రం బ్లాక్-2, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిసెబిలిటీ రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్, హేమ్‌చంద్ దేవ్‌చంద్ చారిటీస్ ట్రస్ట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల రాష్ట్ర సీఆర్‌ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అంబికా శిశు కేంద్రంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు సరైన వైద్య ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు కృషిచేస్తానని చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రైస్ ఫాతిమా, అంబికా శిశు కేంద్రం డైరెక్టర్ బిందు, కృష్ణవేణి, డాక్టర్ సరోజ ఆర్య, వీఆర్‌పి. శైలజారావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏసీపీకి నోటీసులు

కర్నూలు (టౌన్): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామికి టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ నుంచి శుక్రవారం షోకాజ్ నోటీసులు అందాయి. భవన నిర్మాణాల అనుమతులు జారీ చేయడంలో జాప్యం చేయడంతో పాటు లాగిన్‌లో 10 రోజులకు పైగా ఉండటంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పదే పదే చెబుతున్నా విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారని నోటీసులో పేర్కొన్నారు. 10 రోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): సిద్ధేశ్వరం దగ్గర తీగల వంతెనకు బదులుగా అలుగు/వంతెనను నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తానని ప్రకటించడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం కరువు, కటకాలతో అల్లాడే రాయలసీమ ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు సిద్ధేశ్వరం అలుగు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోలవరం పూర్తయి రాయలసీమకు గోదావరి నీళ్లు తరలిస్తే నింపేందుకు రిజర్వాయర్లు లేకపోవడంతో వెంటనే గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు కేంద్రంతో మాట్లాడి నిధులు రాబట్టే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఉందన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
AL ECOMET 1615/4200 HSD BS6
20FT 2022 MODEL AP39 UF 2147
Engine No : NGHZ416512
Chassis No : MB1A3GCD1NRHY4240
Cell: 99594 54998
Door No : 62-65, 1st Floor,
SV Complex, RS Road, KURNOOL.

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింటు అనగా కాశిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి కె.వెంగళరెడ్డి. ఓర్వకల్లు గ్రా & మండలం తరుపున యిచ్చు ప్రకటన ఏమనగా నా క్లయింటు పేరున ఓర్వకల్లు రిజిస్ట్రార్ ఆఫీసు నందు రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెం. 3144/2022 తేది: 20-08-22. ఓర్వకల్లు నుండి కర్నూలుకు పోవునప్పుడు నేషనల్ హైవే 40 పైన 30-7-24వ తేదీన క్రింద తెలిపిన షెడ్యూలు నందలి డాక్యుమెంటు పోగొట్టుకొని పోయినది. కావున అది ఎవ్వరికైన దొరికిన యెడల క్రింది అడ్రసు నందు తెలియచేయగలరు.
షెడ్యూలు: House Door No. 11-58 in Survey No. 124/9 at Orvakal (Vi) Resident. Document No. 3144/22, Dt: 20-8-22. విస్తీర్ణం: 734.138 చదరపు అడుగులు. లేదా 81.57 చ.గజాలు చెక్కుబంది: తూర్పు: కాశిరెడ్డి నరసింహారెడ్డి ఇల్లు. పడమర: పబ్లిక్ రోడ్డు. ఉత్తరం: సందు రస్తా. దక్షిణం: యం.వేణుగోపాల్ రెడ్డి ఇల్లు.
కె.రాజమోహన్ రెడ్డి, అడ్వకేటు, కర్నూలు. సెల్: 94405 69130

DOCUMENT LOST
I, K.Raja Mohan Reddy on behalf of my client Kasireddy Vishnu Vardhana Reddy S/o Kasireddy Vengala Reddy R/o Orvakal (Vi) is making this declaration that he lost his house Document No. 3144/22 Dt: 20-8-22 registered in the office of the Joint Sub-Registrar, Orvakal Relates to house no. 11-58 in Sy.No. 124/9 of Orvakal (Vi) an extent of 734. 138 Squar Feet of 81.57 Square Yards with following boundaries. **East:** House of Kasireddy Narasimha Reddy, **West:** Public Road, **North:** Sandhu Rastha, **South:** House of M.Venugopal Reddy, while he was travelling from Orvakal to Kurnool. on National High Way 40 & 30/7/24. If any one found or traced to above document pleast to inform below address.
K.Raja Mohan Reddy,
Advocate, Kurnool. Cell: 94405 69130

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో
మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com